

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

శనివారం,28 ఫిబ్రవరి 2026 | 8 పేజీలు

# కాకినాడలో రేషన్ మాఫియాలో 'ట్విస్ట్'..!!




## పట్టుబడిన 43 బస్తాలు ఎక్కడివి?

- షాపులో స్టాక్ సరిపోయిందన్న ఎం.ఎస్.ఓ.. పోలీసుల సాక్ష్యాల ముందు అధికారుల నాటకం!
- జగన్నాధపురం 69వ నంబర్ షాపు డీలర్ భర్త రాంబాబుపై ఎఫ్.ఐ.ఆర్, అరెస్ట్
- రైస్ మిల్లు, రేషన్ షాపు, దోస్తు వాహనాల నెట్‌వర్క్ బట్టబయలు - 'అధ్యక్షుడి' వసూళ్ల పర్వం?
- 43 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టుబడినా.. అధికారుల లెక్కల్లో 'అంతా ఓకే'!
- వచ్చే నెల సరుకు ముందే మాయం - పర్యవేక్షణ శూన్యమని మండిపడుతున్న ప్రజలు



బియ్యం బస్తాలు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

కాకినాడ పౌరసరఫరా వ్యవస్థలో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో చెప్పడానికి జగన్నాధపురం ఘటన ఒక సజీవ సాక్ష్యం. పోలీసుల కళ్లముందే 43 బస్తాల రేషన్ బియ్యం దోస్తు వాహనంలో లోడ్ చేస్తూ పట్టుబడితే, తనిఖీకి వచ్చిన సివిల్ సప్లై అధికారులు మాత్రం 'షాపులో స్టాక్ సరిపోయింది' అని తేల్చేయడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వ ముద్ర ఉన్న జ్యూట్ బ్యాగులతో సహా రాజానగరం తరలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఆ 43 బస్తాలు ఆకాశం నుంచి ఊడిపడ్డాయా? లేక అధికారులే తెచ్చి అక్కడ పెట్టారా? అనే ప్రశ్నలు ఇప్పుడు కాకినాడ వాసులను వేధిస్తున్నాయి. డీలర్ల వెనుక ఉన్న ఆ'అధ్యక్షుడి' అండదండలు, అధికారుల ఆశీస్సులు ఉంటే ఎంతటి అక్రమాన్నైనా సక్రమంగా చూపించవచ్చని ఈ ఘటన నిరూపిస్తోంది. నిఘా లోపించిన నెలాఖరు సమయంలో పౌరసరఫరా అధికారుల కళ్లముందే కోట్ల రూపాయల ప్రజాధనం పక్కదారి పడుతోంది. పోలీసుల దాడుల్లో దొరికిన ఈ 43 బస్తాలు మంచుకొండలో ఒక చిన్న ముక్క మాత్రమే.. లోతుగా తవ్వితే రాజానగరం మార్గంలో సాగుతున్న అసలు దోపిడీ దందా, దాని వెనుక ఉన్న అధికారుల పాత్ర బట్టబయలవుతుంది.

- మిగతా 2 లో..

సూర్య బ్యూరో ఉమ్మడి గోదావరి జిల్లాలు

# గోదావరి తీరంలో అక్రమ ఇసుక త్రవ్వకాలు

-రెండు డ్రెడ్జింగ్ బోట్ల సీజ్ -నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ తప్పదు : జిల్లా గనుల శాఖ అధికారి హెచ్చరిక



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ (సూర్యప్రతినిధి)** : రాజమహేంద్రవరం అర్బన్ మరియు రూరల్ మండలాల పరిధిలో ఇసుక మాఫియాపై అధికారులు ఉక్కుపాదం మోపారు. పిడింగొయ్య, కోటిలింగాల గ్రామాల్లో శుక్రవారం జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసోదాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను వెలికితీస్తున్న రెండు భారీ డ్రెడ్జింగ్ బోట్లను సీజ్ చేసినట్లు జిల్లా గనులశాఖఅధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి వెల్లడించారు. ధవళేశ్వరం ఇసుక ర్యాంపు నుండి రోటరీ కైలాస భూమి వరకు నదీ ప్రవాహంలో గట్టు సమీపంలో (KM3.200వద్ద) అక్రమంగా ఇసుక త్రవ్వకాలు సాగిస్తున్న ఒక డ్రెడ్జింగ్ బోటును అధికారులు గుర్తించారు. విచారణలో అది ఏల్చూరుకు చెందిన యం.హరికృష్ణదిగా తేలింది. అలాగే,కోటిలింగాల డి-సిల్టేషన్ ర్యాంపు సమీపంలోని KM 11.900 వద్ద ఇసుక సక్కింగ్ మెషినరీతో సిద్ధంగా ఉన్న "అయినవిల్లి వరసిద్ధి వినాయక" అనే పేరుగల మరో బోటును గుర్తించారు. ఇది విజయవాడకు చెందిన రాకీ అనే వ్యక్తికి చెందినదిగా

- తరువాయి 2లో..

# వాడపల్లిలో శరవేగంగా అభివృద్ధి పనులు

- ఆలయ అభివృద్ధి,నెలకోసారి ఆదాయం లెక్కలు
- గతంలో కన్నా భక్తులకు మెరుగైన సౌకర్యాలు
- దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్** : కోనసీమ తిరుమల వాడపల్లి ఆలయంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు అన్నారు. వేంకన్న హుండీ ఆదాయం రూ.2.17కోట్లు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనమాట్లాడుతూ ఆలయ ఆదాయ, వ్యయాల లెక్కలన్నీ పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటూ,నెలకోసారిఆదాయ, వ్యయాల వివరాలు మీడియా సమావేశంలో తెలపాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సైతం ప్రజలకు, భక్తులకు అన్ని విషయాలు వివరించాలని తెలిపారన్నారు. ప్రస్తుతం దేవస్థానం వద్ద రూ.27కోట్ల రూపాయలు నిల్వ ఉన్నాయన్నారు. అందులో రూ.14.45కోట్లు ఎఫ్డీఏల రూపంలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనగా 2024 నాటికి బ్యాంకులో ఎఫ్డీఏల రూపంలో రూ.5 కోట్లు మాత్రమే ఉన్నాయన్నారు. 23-9-24కి ఆ మొత్తం రూ.6.47కోట్లకు పెరిగిందన్నారు. నేటికి అంటే సుమారు ఏడాదిన్నరలోనే రూ.27.82 కోట్లకు పెరిగిందన్నారు. 2023-24లో నెలవారీ ఆదాయం సైతం రూ.52,51,290లుగా

- తరువాయి 2లో..

# కాకినాడ రేషన్ మాఫియాలో 'ట్విస్ట్'..

## పట్టుబడిన 43 బస్తాలు ఎక్కడివి?

**సూర్య బ్యూరో ఉమ్మడి గోదావరి జిల్లాలు :** కాకినాడ నగరంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా అధికారుల అండతోనే అడ్డూఅదుపు లేకుండా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. పౌరసరఫరా అధికారుల నేరపూరిత ఉదాసీనత, వ్యవస్థలోని అవినీతి వెరసి.. నిరుపేదల కడుపు నింపాల్సిన బియ్యం నిరంతరాయంగా నల్లబజారుకు తరలిపోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని కవచంగా చేసుకుని కొందరు డీలర్లు బరితెగించి సాగిస్తున్న ఈ దందా బట్టబయలైంది. జగన్నాథపురం గొల్లపేటలో అర్ధరాత్రి వేళ వెలుగుచూసిన ఈ ఘటనే ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

**అర్ధరాత్రి దొరికిన అక్రమ భాగోతం!**

తేదీ 26-02-2026 రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో గొల్లపేట ఎం ఎస్ ఎన్ ఛారిటీస్ సమీపంలోని 69వ నంబర్ రేషన్ షాపు వద్ద గుట్టుచప్పుడు కాకుండా పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా.. వన్ టౌన్ పోలీసులు మెరుపు దాడి చేశారు. అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం నెంబర్ ౹ూ౹ూ 39 ౪ 2468 అక్రమంగా లోడ్ చేసిన 43 బస్తాల నేరుగా ప్రభుత్వ జ్యూట్ బ్యాగులతో సహా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో డీలర్ భర్త రాంబాబుతో పాటు బియ్యం కొనుగోలు చేసే మరో ఇద్దరిని కాకినాడ వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు.

**నిఘా లోపం.. అధికారుల మామూళ్ల పర్వం?**

కాకినాడలో సుమారు 70 వేల రేషన్ కార్డులు ఉన్నప్పటికీ, సరుకు సక్రమంగా లబ్ధిదారులకు చేరుతుందా లేదా అన్న పట్టింపు అధికారులకు కరువైంది. సివిల్ సప్లై అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కావడం, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకపోవడం వల్ల కాకినాడలో డీలర్లు ఆడిందే ఆటగా సాగుతోంది. ఎం.ఎస్.ఓ స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే అర్ధరాత్రి వేళల్లో ఇంతటి దారుణాలు జరుగుతున్నాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**మిల్లులు, దోస్తు వాహనాల నెట్‌వర్క్!**

ఈ అక్రమ రవాణా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు స్పష్టమవుతోంది. రేషన్ షాపుల నుంచి బియ్యం బస్తాలు నేరుగా మిల్లులకు తరలిపోతున్నాయని తెలుస్తోంది. బియ్యం అక్రమ రవాణాకు 'దోస్తు' వాహనాలను ప్రధానంగా ఉపయోగిస్తున్నట్లు సమాచారం. అధికారులు, దళారులు మరియు డీలర్లు కలిసి ఈ అక్రమ రవాణాను సాగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ బియ్యం రాజానగరం పరిసరాల్లోని రైస్ మిల్లులకు చేరవేసి, అక్కడ రీ-సైక్లింగ్ చేసి మళ్లీ అమ్ముకుంటున్నారని తెలుస్తోంది.

**అధ్యక్షుడి వసూళ్లు -అండగా నిలుస్తారా?**

డీలర్ల వ్యవస్థలో ఒక వ్యక్తి 'అధ్యక్షుడు' హోదాలో చలామణి అవుతూ, అధికారులను మేనేజ్ చేస్తానని డీలర్ల వద్ద భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎక్కడైనా తనిఖీలు జరిగినా లేదా పోలీసులు పట్టుకున్నా, తాను చూసుకుంటాననే హామీతో డీలర్లను రెచ్చగొడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వసూళ్ల వెనుక పౌరసరఫరా శాఖలోని ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నెలాఖరు 'అదును'.. అక్రమ రవాణాకు ప్లాన్!**

సాధారణంగా ఒకటో తారీఖు నుంచి 15వ తారీఖు వరకు అమ్మకాలు జోరుగా సాగే సమయంలో వ్యవస్థలన్నీ నిఘా నీడలో ఉంటాయి. అయితే, నెలాఖరు సమయంలో అధికారుల నిఘా ఉండదని కనిపెట్టిన డీలర్లు.. ఇదే అదనుగా అక్రమాలకు తెగబడుతున్నారు. ఇప్పటికే ఎం.ఎల్.ఎస్ పాయింట్ల నుంచి డీలర్లకు మార్చి నెల అమ్మకపు సరుకు చేరగా, ఆ సరుకును ఒకటో తారీఖు లోపే పక్కదారి పట్టించడం చూస్తుంటే వీరి ధైర్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వచ్చే నెల మార్చ్ లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని ఇప్పుడే బయటకు అమ్మేస్తుంటే, సివిల్ సప్లై ఉద్యోగులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**డిఎస్ఓ సారు.. తనిఖీలు ఎప్పుడు?**

ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న 43 బస్తాలను సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించారు. అయితే, కేవలం ఒక షాపుకే పరిమితం కాకుండా, డిఎస్ఓ సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో కాకినాడలోని అన్ని రేషన్ షాపుల నిల్వలను తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది. నగరంలోని చాలా రేషన్ షాపుల డీలర్లు ఇదే తరహాలో సరుకును బయటకు తరలిస్తున్నారని ప్రజలు బలంగా అనుమానిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో పీడీఎస్ బియ్యం బస్తాలు నేరుగా ప్రభుత్వ జ్యూట్ బ్యాగులతోనే రాజానగరం వైపు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమ రవాణా మార్గాలన్నీ రాజానగరానికే దారి తీస్తున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. కాబట్టి ఆకస్మిక తనిఖీలు చేస్తేనే వ్యవస్థలోని లోపాలు బయటపడి, డీలర్లు బరితెగించకుండా ఉంటారు. పేదలకు న్యాయం జరగాలంటే ఈ మాఫియా మూలాలను వెలికితీయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా జాయింట్ కలెక్టర్ భరత్ అపూర్వ కఠిన చర్యలు తీసుకోవాలని కాకినాడ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# గోదావరి తీరంలో అక్రమ ఇసుక త్రవ్వకాలు

మొదటిపేజి తరువాయి

ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇసుకను తవ్వడం పర్యావరణ నిబంధనలు మరియు గౌరవహైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కిందకువస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

**-కఠిన చర్యలు.. పీడీ యాక్ట్ హెచ్చరిక :** ఈ సందర్భంగా జిల్లా గనుల శాఖ అధికారి మాట్లాడుతూ, ఇసుక వెలికితీతకు డ్రెడ్జింగ్ బోట్లను వినియోగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా సక్కింగ్ మెషినరీని వినియోగిస్తే వారిపై క్రిమినల్ కేసులతో పాటు పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సీజ్ చేసిన బోట్లను తదుపరి చర్యల కోసం జలవనరుల శాఖ ఏ.ఈ.కు అప్పగించారు.

**-తనిఖీల్లో పాల్గొన్న బృందం :** ఈ సంయుక్త తనిఖీలలో జిల్లా గనులు మరియు భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డితో పాటు, జలవనరుల శాఖ ఈ.ఈ.జి.శ్రీనివాసరావు, డి.ఈ. కే.ఆనందబాబు, ఏ.ఈ. శివ, గనుల శాఖ సాంకేతిక సిబ్బంది మనీషా (టి.ఏ.), శైలజ (టి.ఏ.), జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సిబ్బంది యు.వి.వి. సత్యనారాయణ, ఎస్. సాయి కృష్ణ (హోం గార్డ్), మరియు రెవెన్యూ శాఖకు చెందిన వై. సత్యనారాయణ (వీఆర్ఓ, ధవళేశ్వరం), ఎస్. రామిరెడ్డి (వీఆర్ఓ, కోటిలింగాల వార్డు) తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లిలో శరవేగంగా అభివృద్ధి పనులు

మొదటిపేజి తరువాయి

ఉండేదని,2025-26కు వచ్చేసరికి రూ.1,87,33,329లకు పెరిగిందన్నారు. అంటే రమారమి రూ.1.20కోట్ల ఆదాయం పెరిగిందన్నారు. 2026 వ సంవత్సరంలో ఈనెల హుండీ ఆదాయం రూ.2,17,83,350లుగా వచ్చిందన్నారు.గతంలో కన్నావారంవారీ ఆదాయాలు సైతం రెట్టింపుఅయ్యాయన్నారు.2023లో స్వామివారి కల్యాణానికి రూ.1.44కోట్లు ఖర్చుపెట్టారన్నారు. 2024లో రూ.1.20 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. 2025లో రూ.75లక్షలు మాత్రమే ఖర్చుచేశామ న్నారు. అభివృద్ధి సైతం అప్పటికీ ఇప్పటికీ పోల్చి చూస్తే ఎంతో మార్పు కనిపిస్తుందన్నారు. కోనేరు పనులు పూర్తవుతున్నాయని, వకుళమాత అన్నదాన భవనకేంద్రం మార్చి నెలాఖరుకు పూర్తిచేసి భక్తులకు అందుబాటులో తెచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. రహదారి విస్తరణ పనులు సైతం త్వరలో మొదలవుతాయన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంజూరు చేసిన రూ.7 కోట్లతో ఏటిగట్టు రహదారి అభివృద్ధి సైతం జరుగుతుందన్నారు.

మెర్లపాలెం నుంచి లొల్ల వరకూ ఎమ్మెల్యే సహకారంతో రహదారిఅభివృద్ధి జరిగిందన్నారు.వాడపల్లి అనగానే ప్రసిద్ధి క్షేత్రం అని రెండు రాష్ట్రాల్లో వెలుగొందుతుంద న్నారు. ఎమ్మెల్యే బండారు వాడపల్లి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని, డిప్యూటి కమీషనర్ నల్లం సూర్యచక్రధర్రావు సైతం తోడ్పాటు అందిస్తున్నారన్నారు. పారదర్శకంగా అన్ని అంశాలు ప్రజల ముందు భక్తుల ముందు ఉంచాలనే మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న స్వామివారి కల్యాణం అద్భుతంగా నిర్వహిస్తామన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో స్వామివారి వైభవాన్ని ప్రచారం చేస్తున్న మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# దళిత గృహాలపై ఉచిత సోలార్ యూనిట్ పథకం ప్రారంభం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ పేద దళిత కుటుంబాల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం బృహత్ ప్రణాళిక చేపట్టినట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు అన్నారు. సామర్లకోటలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దళిత కుటుంబాల గృహాలపై ఉచిత సోలార్ యూనిట్ పథకాన్ని ఏర్పాటు చేయటంతో, శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల కోసం అందిస్తున్న ఉచిత సోలార్ యూనిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామస్వామి బాబు కోరారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సంకేమ పథకాలను అందిస్తూ, పేదల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయల రంగనాగ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 20వేల మంది లబ్ధిదారులు ఉన్నారని, పెద్దాపురం పిఠాపురం నియోజకవర్గం సంబంధించి సుమారు 6500 మంది ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులు అని, ఇప్పటివరకు 5500 మంది లబ్ధిదారులు సోలార్ విద్యుత్ కోసం అప్లై చేసుకున్నట్లు కాకినాడ జిల్లా ఎస్.ఈ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ గృహ వినియోగదారులకు అందించే సోలార్ విద్యుత్తును రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా నేడు సామర్లకోటలో ప్రారంభిం చినట్లు ఆయన తెలియజేశారు. ఈ ఉచిత సౌర విద్యుత్‌కు సంబంధించి నల్లకు 200 యూనిట్లు లోపు విద్యుత్తు వాడే వారు పథకం అర్హులని, సొంత ఇల్లు ఉండి ఇంటిపై సౌర పలకలు ఏర్పా టు చేయడానికి స్థలం ఉంటే ఈ పథకం ద్వారా లబ్ధి పొందొచ్చని వారికి ఉచితంగా రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ వ్యవస్థ ను ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్.ఈ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు ఈఈ ప్రభాకర్,మార్కెట్ కమిటీ చైర్మన్ అందుగుల మనీ కుమారి,బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్,అడబాల కుమారస్వామి,యార్లగడ్డ రవిచంద్ర, ప్రసాద్, ట్రాన్స్ కో ఏడిఈ కిరణ్, ఏఈ నాగేశ్వరరావు నూనె రామారావు, దాట్ల శ్రీనివాస్, గొల్లపల్లి కామరాజు, అందుగల జార్జి చక్రవర్తి, నూతలపాటి అప్పలకొండ,తాతపూడి కృష్ణ బాబు, గుడాల శంకర్,వల్లూరి శివశంకర్ దొరబాబు, విద్యుత్ శాఖ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# జూద స్థావరంపై అన్నవరం పోలీసుల అర్ధరాత్రి మెరుపుదాడి

**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో జూద రహిత వాతావరణాన్ని కల్పించేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో పెద్దాపురం ఎస్డీపీఓ డి. శ్రీహరి రాజు మరియు ప్రత్తిపాడు సి.ఐ. శ్రీ బి. సూర్య అప్పారావు పర్యవేక్షణలో, అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు మరియు వారి సిబ్బంది శంఖవరం మండలంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. శంఖవరం మండలం కొంతంగి గ్రామశివారు అటవీ ప్రాంతంలో రహస్యంగా జూదం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు నమ్మకమైన సమాచారం అందింది. దీనితో అన్నవరం ఎస్సై మరియు సిబ్బంది సమన్వయంతో అర్ధరాత్రి సమయంలో సదరు జూద స్థావరంపై మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడుల్లో జూదమాడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.21,500లు నగదు, 9 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడు సి.ఐ. మాట్లాడుతూ.. జూదం వంటి సామాజిక రుగ్మతలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఏ ప్రాంతంలోనైనా, ఏ సమయంలోనైనా జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. జూద క్రీడల్లో పాల్గొనే వారిపై మరియు వాటిని ప్రోత్సహించే నిర్వాహకులపై షీట్లు హిస్టరీ షీట్స్ తెరవబడతాయి అని హెచ్చరించారు.అటవీ మరియు శివారు ప్రాంతాల్లో సైతం నిఘా పెట్టి జూదరులను పట్టుకోవడంపై స్థానిక ప్రజలు పోలీసు యంత్రాంగాన్ని అభినందిస్తున్నారు.

# ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను కలిసిన నియోజకవర్గ జనసేన నాయకులు

– ముంపు మండలాల సమస్యలపై వినతి



**ఎటపాక, మేజర్ న్యూస్ :** రాజానగరం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను గురువారం రాజమండ్రి లోని ఆయన నివాసంలో రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన 12 మండలాల జనసేన పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలు, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల వేదనను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముంపు మండలాలైన ఎటపాక, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం ప్రాంతాలు పోలవరం ప్రాజెక్టు వెనక జలాల ప్రభావంతో ప్రతి ఏడాది ముంపునకు గురవుతున్నాయని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. 41.5 కాంటూరు లెవల్ ప్రాతిపదికన కాకుండా ఎటపాక మండలాన్ని మొత్తంగా ఒకే యూనిట్‌గా పరిగణించి సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పునరావాస ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని తక్షణమే అమలు చేసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, అర్హులైన నిర్వాసితులందరికీ భూ ప్యాకేజీ మంజూరు చేసి పెండింగ్ భూ వివాదాలను పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. గ్రామాల్లో పాడైన అంతర్గత రహదారులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించారు. గుండాల ఇసుక ర్యాంప్‌లో ఇసుక కొనుగోలు చేసి తెలంగాణకు అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ముంపు మండలాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని, ఈ అంశాలను జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం నియోజకవర్గంలోని పార్టీ బలోపేతం, తాజా రాజకీయ పరిణామాలపై కూడా విస్తృతంగా చర్చించారు. నేతల వినతిపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల తీవ్రతను గుర్తిస్తున్నానని, క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి, అలాగే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నిర్వాసితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మారాసు గంగాధర్‌తో పాటు 12 మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, వీర మహిళలు, జనసైనికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో చండీ హోమం

అన్నవరం, మేజర్ న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో, క్షేత్ర పాలకురాలిగా విరాజిల్లుతున్న, శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ వనదుర్గ అమ్మవారిని వివిధ రకముల పుష్పములతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం వేద పండితులు, వ్రత పురోహితులు, అమ్మవారికి శ్రీ సూక్తం, పురుష సూక్తం, మూల మంత్రములు, నవగ్రహ అర్చన నిర్వహించి, 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించిన భక్తులకు, వేద పండితులు వేద ఆశీర్వచనం గావించగా, ఆలయ అర్చకులు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండి తులు, ఆలయ ప్రధాన అర్చకులు,



ఆలయ అర్చకులు, వ్రత పురోహితు లు, దేవస్థానం అధికారులు, భక్తులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులకు సైన్స్‌పై క్విజ్ పోటీలు

**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ నందు ప్రధానోపాధ్యాయిని కే.శ్రీదేవి అధ్యక్షతన సీనియర్ సైన్స్ టీచర్ ఏఎల్వీ కుమారి ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డేని పురస్కరించుకొని విద్యార్థినీ విద్యార్థులకు క్విజ్ కార్యక్రమము ఏర్పాటు చేయడమైనది. ఈ క్విజ్ కార్యక్రమాల్లో ఆరు నుంచి పది వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులకు సైన్స్‌కు సంబంధించి వివిధ విభాగాల్లో 25 ప్రశ్నలు ఐదు రౌండ్లలో ప్రశ్నించుట జరిగినది. ఈకార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనిరి. దీనివలన విద్యార్థులకు అవగాహన సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో సైన్స్ టీచర్ సిహెచ్వి భద్రమ్మ, ఎస్ కే రజియా బేగం, కే.అరుణ, యు.నాగమణి, డి.సూర్యనారాయణ,శ్రీలక్ష్మి, శ్రీవల్లి, దేవి, కాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

# నేడు జెఎన్టీయుకెలో 'జిల్లాస్థాయి వికసిత్ భారత్ యువ పార్లమెంట్-2026'

**కాకినాడ, మేజర్ న్యూస్ :** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న "జిల్లా స్థాయి వికసిత్ భారత్ యువ పార్లమెంట్ – 2026" ప్రారంభోత్సవ కార్యక్రమం 28 ఫిబ్రవరి 2026న జేఎన్టీయూకే ప్రాంగణంలో ఘనంగా జరగనుంది. తూర్పు గోదావరి జిల్లా నోడల్ జిల్లాగా ఈ కార్యక్రమం నిర్వహించ బడుతుంది. ఈ కార్యక్రమానికి కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. యువతలో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు మరియు జాతీయ చైతన్యాన్ని




పెంపొందించడమే ఈ యువ పార్లమెంట్ కార్యక్రమం లక్ష్యంగా నిర్వహించబడుతోంది. "ఎమర్జెన్సీకి 50 సంవత్సరాలు – భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు" అనే అంశంపై ప్రసంగ పోటీ కూడా ఈ సందర్భంగా నిర్వహించబ డుతుంది. జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. జి.శ్యామ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తున్నారు. డా. జి.శ్యామ్ కుమార్ విద్యార్థులు, అధ్యాపకులు మరియు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆహ్వానించారు. దేశ నిర్మాణంలో యువత పాత్రను బలపరచే ఈ వేదికలో పాల్గొని "వికసిత్ భారత్" లక్ష్య సాధనలో భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

# రావులపాడు ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

– జిల్లా స్థాయిలో రోల్ ప్లేలో 'ప్రథమ' స్థానం..
అధికారుల ప్రశంసల జల్లు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** అమలాపురం బాయ్స్ హైస్కూల్ వేదికగా జరిగిన జిల్లా స్థాయి భాషోత్సవ పోటీల్లో 'రావులపాడు విద్యార్థులు' తమ అద్భుత ప్రతిభతో సత్తా చాటారు. ముఖ్యంగా ఇంగ్లీష్ రోల్ ప్లేలో జిల్లాలోనే ఉత్తమ ప్రదర్శన కనబరిచి అందరి దృష్టిని ఆకర్షించారు. గెలుపు కేతనం ఎగురవేసిన విజేతలు ఇంగ్లీష్ రోల్ ప్లేలో అత్యంత ప్రతిభావంతమైన ప్రదర్శనతో జిల్లా ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న కె.నిత్యశ్రీ, ఎస్.షర్మిల, ఇంగ్లీష్ – స్టోరీ రైటింగ్ జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన ఎస్.షర్మిల అనే విద్యార్థులు.రావులపాడు పాఠశాల కీర్తిని జిల్లా స్థాయి వేదికపై రెపరెపలాడించిన విద్యార్థులను గైడ్ టీచర్ కె.వి. శేఖర్, శ్యామల, వీరవేణి లను రావులపాడు సర్పంచ్ సత్యదేవి బాబ్జి, ఎంపిటిసి ఆశా కిషోర్, గ్రామ పెద్దలు పెచ్చుటి చిన్నారావు, ఎన్.వెంకన్న, మురళి, నాగార్జున, జి.శ్రీనివాస్ మరియు ప్రధానోపాధ్యాయులు మధుసూదనరావు, పీ.వీ.గిరి, జి.సునీత, సత్యవతి, మేరీ జోన్స్, వసుంధర, ఆంజనేయులు, సుజాత, వెంకట లక్ష్మీ, గోపాలకృష్ణ, పద్మజ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# లక్ష్మీపురం ఎఫ్ఎన్ఓపై చర్యలు తీసుకోవాలి

– పాత్రికేయుల సమావేశంలో పి.హెచ్.సి సిబ్బంది



**ఎటపాక, మేజర్ న్యూస్ :** గత కొన్ని నెలలుగా తన విధుల పట్ల అలసత్వం ప్రదర్శించడమే కాకుండా తమ విధులకు ఆటంకం కలిగిస్తున్న లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎఫ్ఎన్ఓ పై చర్యలు తీసుకోవాలని పీ.హెచ్.సి సిబ్బంది అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పోలవరం జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామంలో గల ప్రభుత్వ వైద్యశాల ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. సదరు ఎఫ్ఎన్ఓ తన విధి నిర్వహణలో భాగంగా చేయవలసిన విధులు పాటించకుండా తమకు సహకరించక పోవడంతో తామంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ విషయాన్ని స్థానిక వైద్యులు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఎఫ్ఎన్ఓను పలుమార్లు హెచ్చరించి నోటీసులు జారీ చేసినా ఆమె ఖాతరు చేయకుండా మొండి వైఖరి అవలంబిస్తుందని, అలాగే తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తారా..? అంటూ తమపై ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధింపులకు గురిచేస్తుందని వారు ఆరోపించారు.

అదేవిధంగా ఇదే విషయాన్ని ఇప్పటికే ఐటీడీఏ పీవోతో పాటు తమ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని వారు మీడియా సమావేశంలో వెల్లడించారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించి విధుల పట్ల తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. ఈ సమావేశంలో స్టాఫ్ నర్సులు డి.కళ్యాణి, ఎస్.సీత, ఎస్.ఆదిలక్ష్మి, ఫార్మసిస్ట్ జె.ఉదయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ జి.నాగు, ఎంపిహెచ్ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎంపిహెచ్ఎస్ కె.గంగరాజు, ఎంపీహెచ్ఏ ఎస్.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి





**– ఏజెన్సీలో మానవ హక్కుల అధికారి పర్యటన**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలను, కొత్త కాలనీ లోని అంగన్వాడీ కేంద్రాన్ని, కుత్రవాడ జాఫ్రా ప్రాసెసింగ్ యూనిట్ ను మానవ హక్కుల జాతీయ కమిషన్ మానిటరింగ్ అధికారి హేమంత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు సద్వినియోగ పరుచుకొని గిరిజనులు ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని బాగా చదివి మంచి ఉద్యోగాలు పొందే విధంగా లక్ష్యం నిర్ణయించుకోవాలన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మెనూ అమలు చేయాలన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు ఇంగ్లీష్ తో పాటు హిందీ చదవడం రాయటం నేర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విద్యార్థులకు అర్థమవుతున్నది లేనిది విద్యార్థులను ఆయన అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల ఆటల పోటీలలో పాల్గొని జాతీయస్థాయిలో మెడల్స్ సంపాదించే విధంగా ఒక ఆటను విద్యార్థులు ఎంచుకోవాలన్నారు. అదేవిధంగా నీతి అయోగ్ నిధులతో కొత్త కాలనీలోని 12 లక్షల రూపాయలు వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఆయన పరిశీలించారు. అంగన్వాడిలో చదువుతున్న బాలబాలికలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పాలు, గుడ్లు బాల బాలికలకు అందించాలన్నారు. అదేవిధంగా కుత్రవాడలో జాఫ్రా రైతులు ఏవిధంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నది, ఎన్ని మహిళా సంఘాలు ఉన్నవి, ఒక కిలో జాఫ్రా కు ప్రస్తుతం ఎంత రేటు ఉన్నది ఆయన ఆరా తీశారు. దళారుల దగ్గర మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా 2 లక్షల 60 వేల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన జాఫ్రా ప్రాసెసింగ్ మిషన్ పరిశీలించి మహిళ సంఘాల ప్రతినిధులతో ఏవిధంగా ప్రాసెస్ చేయుచున్నది ఒక్కొక్క మహిళా సంఘుశీ సభ్యులకు ఎన్ని జాఫ్రా మొక్కలు ఉన్నాయి ఆయన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ ఓ ఎఫ్ ఆర్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, ఐటీడీఏ ఏపిఓ జనరల్ డి ఎన్ వి రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ శ్రీనివాసరావు, తాసిల్దార్ అమ్మాజీ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య , వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న రావు, కౌన్సిలర్ విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ హక్కులు ద్వారా అభివృద్ధి చెందాలి

పోలవరం (రంపచోడవరం) జిల్లాలో కమ్యూనిటీ అటవీ హక్కులు ద్వారా గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ మోనిటరింగ్ అధికారి హేమంత్ కుమార్ పేర్కొన్నారు. దేవీపట్నం మండలం మద్దిరాతిగూడెంలో కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్ కమిటీ సభ్యులతో జాతీయ మానవ హక్కుల మోనిటరింగ్ అధికారి హేమంత్ కుమార్, రాష్ట్ర ఆర్ఓఎఫ్ఆర్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, సబ్ డిఎఫ్ఓ అనూష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజనులు అభివృద్ధి చెందే విధంగా కమ్యూనిటీ ఫారెస్ట్ రైడ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మద్దిరాతి గూడెంలోని కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్ ద్వారా వెయ్యి ఎకరాల భూమిలో గిరిజనులు వివిధ రకాల అటవీ ఉత్పత్తులు సికాయి, చింతపండు, కుంకుళ్ళు, వెదురు ఫలసాయం వచ్చినప్పుడు గ్రామంలో గిరిజనులందరూ సమానంగా తీసుకోవచ్చనన్నారు. గిరిజన ప్రాంతంలో అడవులను రక్షించుకొనే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్ కు సంబంధించిన యాక్షన్ ప్లాన్ తయారుచేసి సమర్పించాలన్నారు. ఒక్కొక్క కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్ కమిటీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా 16 లక్షల రూపాయలు వరకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ఓఎఫ్ఆర్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, సబ్ డిఎఫ్ఓ అనూష, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డి.ఎన్.వి.రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, తాసిల్దార్ కె.సత్యనారాయణ, ఎంపీడీవో సాల్మన్ రాజ్, ఫారెస్ట్ రేంజ్ అధికారి కొండలరావు, డిఆర్డిఏ యాంకర్ పర్సన్ రామరాజు, ఆర్ఓఎఫ్ఆర్ అధికారి జి.ఆనంద్, ఎస్.వెంకట రమణ, పీఎంయు అధికారి మోహన్, సర్పంచ్ కర్రి చిన్న బుల్లబ్బాయి రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



## సెక్యూరిటి ఆడిట్‌లో పాల్గొన్న డిఎస్పి శ్రీహరిరాజు

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం కోర్ట్ సముదాయాల నందు శుక్రవారం సెక్యూరిటీ ఆడిట్ కార్యక్రమం పెద్దాపురం డిఎస్పి డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి, ఆర్.ఎస్.ఐ. ఎం.త్రినాథ్, పెద్దాపురం సిఐ పి.విజయశంకర్, ఆర్&బి, ఫైర్, ఎలక్ట్రికల్ శాఖల అధికారులు (ఎఇ పి.సుబ్బారావు) పాల్గొన్నారు.

# ఎన్నికల హామీ అమలు చేయాల్సిందే

**– అంగన్వాడీలు నిరాహార దీక్షలు**



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందేనని పోలవరం జిల్లా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి నిర్మల, ఎస్,రాజేశ్వరి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారం మూడో రోజు జిల్లా స్థాయి రిలే నిరాహార దీక్షలను అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పోలవరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సున్నం రాజేశ్వరి బి.నిర్మల శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ డిమాండ్స్ సాధన కోసం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట జిల్లా స్థాయి రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో అంగన్వాడీ వర్కర్లు పనిచేస్తున్నారని, అధిక పని భారం వల్ల పూట గడవని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల ప్రకారం నెలకు 26 వేల రూపాయలు కనీస వేతనంగా ఇవ్వాలని న్యాయస్థానాలు చెప్తున్నప్పటికీ అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వమైనా అమలు చేయడంలో విఫలమైతుందన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సమస్యల పరిష్కారానికై ప్రాజెక్టు స్థాయి రిలే దీక్షలు సందర్భంగా అంగన్వాడీ బడులకు అంతరాయం కలగకుండా అంగన్వాడీ ఆయాలతో కలిసి విధులు నిర్వహిస్తూ రిలే నిరాహార దీక్షలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ల సాధనకై మార్చి 2న విజయవాడలో తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి అంగన్వాడీ లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిమ్మరసం ఇచ్చి నాయకులు దీక్షలను విరమింపజేశారు. ఈ దీక్షలకు ప్రజాసంఘాల జిల్లా నాయకులు ఐవి రమణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి కారంరామలక్ష్మి, వి.ఆర్.పురం, చింతూరు, రంపచోడవరం, మారేడుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీలు పాల్గొన్నారు.

## 'పెద్దపులి' భయంతో వణుకుతున్న గిరిజన గ్రామాలు

**– డ్రోన్‌తో అటవీశాఖ అధికారులు మానిటరింగ్**






**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారంతో గిరిజన గ్రామాలు భయంతో వణుకుతున్నాయి. కొద్దిరోజుల క్రితం పాపికొండలు అభయారణ్యంలో అటవీశాఖ అధికారులు విడిచిపెట్టిన పెద్దపులి రంపచోడవరం అటవీ ప్రాంతంలో గిరిజన గ్రామాల మధ్య సంచరిస్తున్నట్లు వార్తలు రావడంతో ప్రజలు ఏ క్షణాన్న ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. రంపచోడవరం మండలం మర్రివాడ పంచాయతీ పెదకొండ గ్రామంలో పశువులపై పెద్దపులి దాడి చేసి గాయపరిచిన నేపథ్యంలో గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా పెద్దపులి ఫోక్సుపేట అటవీ రేంజ్ పరిధిలో సంచరిస్తుందని సంబంధిత అటవీశాఖ అధికారులే చెబుతున్న నేపథ్యంలో పలు గిరిజన గ్రామాల ప్రజలు పెద్దపులి గ్రామాలపై దాడి చేస్తుందేమోనని భయపడుతున్నారు. అయితే పెద్దపులి అటవీ ప్రాంతంలో తిరుగుతున్నా ప్రజలు భయపడవలసిన అవసరం లేదని అటవీ శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. డిఎఫ్ఓ శివకుమార్ గంగుల్ ఆధ్వర్యంలో ఫోక్సుపేట అటవీ క్షేత్రస్థాయి అధికారికి పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పులి కదలికలను రేడియో కాలర్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అటవీశాఖ అధికారులు తెలిపారు. రంపచోడవరం అటవీ డివిజన్ పరిధిలోని రంప, పెదకొండ, సూదికొండ, భీమవరం అటవీ సమీప గ్రామాల్లో అటవీ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పులి సంచారంపై ఎటువంటి భయభ్రాంతులకు లోను కావలసిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అటవీ సిబ్బంది అప్రమత్తతతో ఉండి పులి కదలికలను గమనిస్తున్నారని, డ్రోన్ థర్మల్ ఇమేజింగ్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పర్యవేక్షణ చేస్తూ, అటవీ సిబ్బందిని అలర్ట్ చేయడం ద్వారా ప్రజలకు అవసరమైన సూచనలు అందజేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఏదేమైనప్పటికీ పెద్దపులి సంచారం వల్ల గిరిజన గ్రామాల్లో అలజడి నెలకొంది. పెద్దపులిని బంధించి జనావాసాలకు దూరంగా తరలించాలని ఏజెన్సీ ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పెద్దపులి కు ఆపద కలిగించకుండా చూడాలని అటవీశాఖ అధికారులు చెబుతున్నా, ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉండడంవల్ల ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## వెంకన్న నిత్య అన్నదాన పథకానికి విరాళాలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్, జూబ్లీహిల్స్ కు చెందిన నడింపల్లి కృష్ణ సూర్య వర్మ, రఘువర్మ రూ.లక్ష; ఈతకోటకు చెందిన కలిదిండి సాయి మణికంఠ, కలిదిండి వెంకట కాశీ హన్షిత్ వర్మ రూ.50 వేలు; వైజాగ్, పెందుర్తి కి చెందిన మహాదేవ్ కార్తికేయ రూ.30 వేలు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి విశిష్టత గురించి తెలియజేశారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# ఆక్రమణల "చెర"లో..పిఠాపురం "రైతు బజార్"

**– ఆక్రమణలపై ఆందోళన చేపట్టిన అఖిలపక్షం నాయకులు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురంలో సుదీర్ఘకాల సమస్యలు ఇంకా వెంటాడుతున్నాయి అనడానికి పిఠాపురం నడిబొడ్డున ఉన్న రైతు బజారే సాక్ష్యం. పవన్ కళ్యాణ్ పిఠాపురం నియో జకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిస్తే పిఠాపురం రూపురేఖలు మారిపోతాయి అనుకున్న ఆశలు కాస్తా... ఇలాంటి దృశ్యాలు చూసినప్పుడు అవి అడియాసలుగా మారిపోతు న్నాయి.అది పాల కుల మరియు అధికారుల నిర్లక్ష్యం కావచ్చు.గత 13 సంవత్సరాలుగా అత్యంత నిరాధరణకు, నిర్లక్ష్యానికి గురైన పిఠాపురం సుదీర్ఘకాల సమస్యల్లో పిఠాపురం నడిబొడ్డున ఉన్న రైతు బజార్ ఒకటి. ఇదే రైతు బజార్ కోసం అనేక పోరాటాలు జరిగాయి. అది ఇప్పటికీ ఒక నాయకుడు చేతుల్లో బంధీగా మారింది అన్నది ఆవేదన కలిగించే అంశం.ఈరైతు బజార్ విషయంపై శుక్రవారం అఖిలపక్ష నాయకులు ఆందోళన చేపట్టారు. పిఠాపురం పట్టణంరాజా వారి కోటలో గల రైతు బజార్ ప్రజలకు రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మన ఊరు మన బాధ్యత స్వచంధ సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్ మాట్లాడుతూ... రూ. 35 లక్షల ప్రజాధనంతో నిర్మించిన రైతు బజార్‌ను కొంతమంది తమ వ్యక్తిగత స్వార్థం కోసం కోర్టులో వేసి అటు ప్రజలకు, రైతులకు తీరని అన్యాయం చేశారని అన్నారు.గత13 సంవత్సరాల నుండి రైతు బజారు మూత బడిందని, అప్పటి నుండి ఇప్పటి వరకు అధికారులు ఎవ్వరూ పట్టించుకోలేదని, అధికా రుల నిర్లక్ష్యం కారణంగా ప్రజా ధనం వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతు బజార్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, ఒక పార్టీకి చెందిన వ్యక్తి రైతు బజార్లో షెడ్డు ఆక్రమించుకొని వ్యాపారం సాగిస్తున్నాడని, కోర్టులో ఉంది అందుకే ఆక్రమించుకున్నాను, ఏమి చేసుకుంటారో చేసుకోండి అని సవాల్ విసురుతున్నారని, ఇసుక నిల్వలు, కంకరు నిల్వలు వేసుకొని వ్యాపారం చేసుకుంటున్నారని అన్నారు. అంతేకాకుండా ఆ రైతు బజార్‌ను డంపింగ్ యార్డ్‌గా, పార్కింగ్ స్థలంగా వినియోగించుకుం టున్నారని ఆరోపించారు. రైతు బజార్‌ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని,లేని పక్షంలో నిరాహారదీక్షకు కూర్చుంటామని, న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## గ్రహణం కారణంగా మార్చి 3న అన్నవరప్పాడు వెంకన్న ఆలయం మూసివేత



**పెరవలి,మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం చంద్రగ్రహణం కారణంగా మార్చి 3న ఉదయం 6.20 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు మూసివేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మీసాల రాధాకృష్ణ తెలియచేశారు. ఆ రోజు ఉదయం 6.30 గంటల లోపు అర్చకులు స్వామి వారి ప్రాతః కాల అర్చనాదికాలు ముగించి స్వామివారి ద్వారాలు మూసివేస్తారని తెలియచేశారు. తిరిగి రాత్రి 7.30 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ఏకాంతంగా శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.గ్రహణం రోజున ఆలయంలో ఏ విధమైన ఆర్జిత సేవలు, దర్శనాలు లభించవని,తిరిగి మార్చి 4 న యధావిధిగా అన్ని సేవలు లభిస్తాయని కావున భక్తులు గమనిం చాలని ఆలయ కార్యనిర్వాహధికారి మీసాల రాధాకృష్ణ కోరారు.

# రాజవొమ్మంగిలో ఎమ్మెల్యే శిరీష దేవి పర్యటన




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్పర్సన్ మిరియాల శిరీష దేవి శనివారం రాజవొమ్మంగి మండలంలో పర్యటించనున్నట్లు ఏపీ బిజిసీ డైరెక్టర్, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడిపెద్దిరాజు తెలిపారు.

ఉదయం11:00 గంటలకు మండలంలోని ఉర్లాకులపాడు గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అలానే బాధిత కుటుంబ సభ్యుల పరామర్శ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఎన్టీఆర్ భరోసాసామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పెద్దిరాజు తెలిపారు. ఈ మేరకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు అనుబంధ సంఘాల ప్రతినిధులు, నామినేటెడ్ పదవుల సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా 'టెక్నోఫిలియా' వేడుకలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కంప్యూటర్స్ విభాగం వారు "టెక్నోఫిలియా-2కె26"ని ఘనంగా నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ మరియు పి.జి కళాశాలల డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులతో ఆత్మవిశ్వాసం, పోటీతత్వం, సృజనాత్మకత వంటివి పోంపొందించడానికి ఇలాంటికార్యక్రమాలు ఉపయోగపడతా యని ప్రపంచ మొత్తం ఈ రోజు సాంకేతికతపై ఆధారపడి నడుస్తుందని, కోర్సు చదివిన ప్రతీ ఒక్కరికీ ఎన్నో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని,మంచి ప్యాకేజీలతో అత్యున్నతమైన స్థానాన్ని అధిరోహిస్తున్నారని, తెలియజేసి, మన ముందు వస్తున్న ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన బొండా అయ్యప్ప, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్, స్టోరేజ్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగుళూరు,మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని కలిగి ఉండాలని, ముఖ్యంగా కొన్ని విషయాలలో ధైర్యంగా ముందుకు అడుగు వేసేతత్వాన్ని అలవరచుకోవాలని, భవిష్యత్తులో ఏదో జరుగుతుందేమో అనే భయం విడిచిపెట్టాలని, ప్రపంచ దేశాలలో ఎన్నో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉద్యోగాలతో స్వాగతం కలుపుతున్నాయని, వీటిని సాధించాలంటే కమ్యూనికేషన్ స్కిల్‌ని, కోడింగ్ నైపుణ్యత సంపాదించాలని ప్రస్తుతం వస్తున్న కొత్త విషయాన్ని ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని తెలిపారు.

అలాగే సాఫ్ట్‌వేర్ రంగంలోకావాల్సిన మెలకొలువలు, కార్పొరేట్‌కు అవసరమైన నైపుణ్యాలు, వాటికి అనుగుణంగా ఉండే కోర్సుల గురించి తెలియజేసారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదిత్య మహిళ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ఆదిత్య విద్యాసంస్థలలో చదువుకున్న విద్యార్థులు తప్పని సరిగా ఎన్నో మంచి ఉద్యోగ అవకాశాలతో వెళ్తున్నారని, ప్రతీ విద్యార్థి కంప్యూటర్‌కి సంబంధించిన లాంగ్వేజ్‌లు, కోర్సులు నేర్చుకోవాలని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కోడింగ్, డి-కోడింగ్, పి.పి.టి, ప్రాజెక్ట్ ఎక్స్‌పొ వంటి పోటీలు నిర్వహించబడుతున్నాయని, ఆయా పోటీలలో విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుపొందారని తెలియజేశారు. పి.పి.టి. విభాగంలో యన్. షారోన్ మొదటి బహుమతి, సి. హెచ్. పవిత్ర ద్వితీయ బహుమతి,కోడింగ్ విభాగంలో సి. హెచ్. గాయిత్రి ప్రథమ బహుమతి,ఒ.లలితాదేవి ద్వితీయ బహుమతి, డిబగింగ్ విభాగంలో ఎ.సృజనా ప్రథమ బహుమతి, జి.హేమా ద్వితీయ బహుమతి, అత్యధిక ప్లేస్‌మెంట్స్ సాధించిన దాసరి దివ్య మరియు యూనిర్శిటీ పరీక్షలలో అత్యధిక సి.జి.పి.ఎ సాధించిన దాసరి దివ్య మరియు యమ్.భారతి లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, కంప్యూటర్స్ విభాగాధిపతి చిరంజీవి, ఇతర అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు




**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** రామవరం గ్రామంలో, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, పెద్దాపురం వారి ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా పతంజలి ఫుడ్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డి.జి.మ్) ఎ.యస్ ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ చాలా అనుకూలమైన లాభదాయకయమైన పంట అని, యాజమాన్య పద్ధతులు సరైన పద్ధతిలో ఉపయోగించినట్లయితే అధిక లాభాలు పొందవచ్చు అని తెలిపారు. హార్టికల్చర్ ఆఫీసర్ ఎ.శ్రీవల్లి ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వ ఇస్తున్న మొక్క రాయితీలు, డ్రిప్ సబ్సిడీ,అంతర పంటలు గురించి వివరించడం జరిగింది. తరువాత టెక్నికల్ ఫీల్డ్ ఆఫీసర్ సి.హెచ్ దుర్గా ప్రసాద్ ఆయిల్ పామ్‌లోని యాజమాన్యం, యంత్రికరణ పద్ధతులు, చీడ పీడలు, తెగుళ్ళు, మల్చింగ్, గెలల నాణ్యత, ఫెర్టిగేషన్ తదితర విషయాలపై అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి దబార్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ అప్పలరాజు పిప్పల్ల సాగుగురించి తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు,డి.మ్ వై.శ్రీనివాస్,క్లస్టర్ ఆఫీసర్ జె.చక్రబాబు, క్లస్టర్ ఇంచార్జ్ కె.రామకృష్ణ,సూపెర్వైసర్ జి.తమ్మారావు, పి.శివ, ఆర్.గణేష్,వి.రాజా,మరియు ఇతరులు పాల్గొనడం జరిగింది.

## జడ్డంగి ఉరక జలపాతం వద్ద పర్యాటకపార్కు ఏర్పాటుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ

**– చెరుకుంపాలెం నుండి జడ్డంగి అన్నవరం వరకు 7 మీటర్ల రహదారి ప్రతిపాదన**

**– ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిభాస్కర్**






**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని రాజవొమ్మంగి మండలం లోని జడ్డంగి వద్ద సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన కొండగుహల్లో స్వయంభుగా వెలసిన పురాతన భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి వారి ఆలయం కలదు.ఆలయం ప్రక్కనే పరవళ్ళు తొక్కుతూ మడేరు వాగు ప్రవహించడం ,ఉరక జలపాతం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులను,పర్యాటకులను ఆకర్షించేవిధంగా,వారికి తగు సౌకర్యాలు ఏర్పాటుచేయబడ్డాయి. ఆధ్యాత్మికంగా,పర్యాటకంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆశిస్తూ శివాలయం,ఉరక జలపాతం మధ్యఉన్న 2ఎకరాల ఖాళీ ప్రదేశంలో పర్యాటకపార్కు నిర్మించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు, పర్యాటక మంత్రిలకు నివేదించి పర్యాటకపార్కు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిభాస్కర్ ను కోరుతూ 93లక్షల వ్యయం అవుతుందని ప్రభుత్వ ఇంజనీర్లు రూపొందించిన ఎస్టిమేట్ కాపీలు మరియు పరవళ్ళు తొక్కుతూ ఉరక జలపాతం వద్ద రమణీయ దృశ్యాలు ఫొటోలు టిడిపి సీనియర్ నాయకులు గణజాల తాతారావ్ అంద జేశారు. అలానే మండలంలో చెరువు కొమ్ముపాలెం నుండి జడ్డంగి అన్నవరం వరకూ 7 మీటర్ల వెడల్పు ఆర్ అండ్ బి రహదారి 12కోట్ల95లక్షల ఎస్టిమేషన్ వ్యయంతో నిర్మించాలని,25లక్షల వ్యయంతో ఉర్లాకులపాడులోని బండకొండ రిజర్వాయర్ కూలిపోయిన స్లూయిజ్ పునః నిర్మాణం చెయ్యాలని ఎమ్మెల్యే శిరీష భాస్కర్ను కోరగా సంబంధిత మంత్రివర్యులకు నివేదించి గ్రాంట్ మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మిరియాల శిరీషభాస్కర్ హామీ ఇచ్చారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గణజాల తాతారావ్ తెలిపారు.అసెంబ్లీ సమావేశాలనిమిత్తం అమరావతిలో ఉన్న ఎమ్మెల్యే శిరీషభాస్కర్ అసెంబ్లీసమావేశం అనంతరం తెలుగుదేశం సీనియర్ నాయకులుగణజాల తాతారావ్,వాసంశెట్టి గంగాధర్, కంటపురెడ్డి వీరబాబు(శ్రీను), గణజాల మల్లిఖార్జున కలిసి పర్యాటకంగా మనప్రాంత అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# కిమ్స్‌లో ప్రపంచ తెలుగు మహా సభలు





**– హాజరు కానున్న గవర్నర్‌లు,**

**ప్రముఖ ప్రవచన కర్తలు చాగంటి, గరికిపాటి**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** ప్రపంచ తెలుగు మహా సభలు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో రెండు రోజులపాటు ఫిబ్రవరి 28 మరియు మార్చి 01 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కిమ్స్ మరియు చైతన్య విద్యా సంస్థల స్థాపకులు మరియు అధినేత కె.వి.వి.సత్యనారాయణరాజు (చైతన్య రాజు) తెలిపారు. గత రెండు సంవత్సరాలు ప్రపంచ తెలుగు మహా సభలు చైతన్య రాజు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం గైట్ విద్యా సంస్థల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. తెలుగు భాషాభివృద్ధికి పిల్లలకు బాల్య దశలోనే ఆసక్తి మరియు మక్కువ పెంచే ఉద్దేశ్యంతో ఈ సంవత్సరం డా.బి.ఆర్. అంబెడ్కర్ కోనసీమ జిల్లా లోని అన్ని పాఠశాల విద్యార్థులకు తెలుగు సాహిత్య మరియు సాంస్కృతిక అంశాలలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, పద్య పఠనం, విశిష్ఠ వేష ధారణ మరియు ఏక పాత్రాభినయం అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు మండల మరియు మహా సభల స్థాయిలలో నగదు బహుమతులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. 27వ తేది శుక్రవారం నాడు కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానము వద్ద, భద్రాచలం నుండి ఉత్సవ విగ్రహాలతో వచ్చిన నమూనా దేవాలయంలో కిమ్స్ చైర్మన్ మరియు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్ చైతన్య రాజు, బదరీ లక్ష్మి దంపతులు మరియు కిమ్స్ ఎం.డి కె.రవి కిరణ్ వర్మ, శేష పవిత్ర దంపతులు, మరియు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ శశి కిరణ్ వర్మ, వెంకట లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అనేక మంది స్థానిక ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు మరియు భక్తులు విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకొని, తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఈ ప్రపంచ తెలుగు మహా సభలకు ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరి బాబు, తెలంగాణా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర మరియు రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్, శాసనసభల సభ్యులు, న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, తెలుగు భాషా పండితులు, ప్రవచన కర్తలు, కవులు మొదలగు వారు అనేకమంది అతిధులుగా విచ్చేయుచున్నారని, సనాతన ధర్మ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు మరియు మహా సహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహా రావు ఈ సభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ మహా సభల ముఖ్య వేదికకు తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన నందమూరి తారక రామారావు పేరు ఖరారు చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాలలో అనేక తెలుగు భాషా సాహితీ సదస్సులు, కవి సమ్మేళనాలు, విద్యార్థులకు మహాసభల స్థాయి పోటీలు, బహుమతి ప్రధాన కార్యక్రమాలు మరియు తెలుగు జాతి సంస్కృతి మరియు సాంప్రదాయాలకు అద్దం పట్టేలా సందర్శకులకు తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని చాటేలా అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఈ తెలుగు మహా సభలలో భక్తుల దర్శనార్థం అన్నవరం, భద్రాచలం, సింహాచలం, ద్వారకా తిరుమల మరియు అయినవిల్లి దేవాలయాల నమూనాలు ఏర్పాటు చేశామని, ఆయా దేవాలయాల పండితులు విచ్చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.


ఈ సభలకు తెలుగు భాషాభిమానులందరూ ఆహ్వానితులే అని, తెలుగు వారందరూ విచ్చేసి ఈ తెలుగు భాషా పరిరక్షణ కార్యక్రంలో పాల్గొని ఈ ప్రపంచ తెలుగు మహా సభలను జయప్రదం చేయాలని చైతన్య రాజు మరియు కిమ్స్ ఎం.డి కె.రవి కిరణ్ వర్మ కోరారు.



## మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో ఆసాదులు, వేదపారాయణదారులు, పూజ, అర్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పులిహోరా ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకట రమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# వందన్ వికాస కేంద్రాలతో మహిళలు అభివృద్ధి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లాలో మహిళా సంఘాలు వందన్ వికాస కేంద్రాల ద్వారా అభివృద్ధి చెందేలా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని జాతీయ మానవ హక్కుల కమిషన్ మానిటరింగ్ అధికారి హేమంత్ కుమార్ పేర్కొన్నారు. రంపచోడవరం మండలం పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలోని జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్‌ను జాతీయ మానవ హక్కుల కమిషన్ మానిటరింగ్ అధికారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వివిధ రకాల పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వందన్ వికాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వందన్ వికాస కేంద్రాల ద్వారా ఏర్పాటుచేసిన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏ విధంగా నిర్వహించుచున్నది పరిశీలించారు. ఒక కిలో జీడిపిక్కలు ఎంత రేటుకు కొనుగోలు చేసేది, అదేవిధంగా ఒక కేజీకి ఎంత జీడిపప్పు వస్తున్నది, కేజీ జీడిపప్పు ఎంత రేటు ఉన్నది ఆయన ఆరా తీశారు. ప్రస్తుతం జీడిపక్కల ప్రాసెసింగ్ యూనిట్లో ఎంతమంది పనిచేయుచున్నది ఒక్క సంవత్సరంలో జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ఎంత లాభం వచ్చుచున్నది ఆయన ఆరా తీశారు. జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏ విధంగా పనిచేయుచున్నది ఆయన ఆరా తీశారు. వందన్ వికాస కేంద్రాల ద్వారా ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం రంపచోడవరంలో గురుకుల బాలుర పాఠశాల నూతన డార్మెంటరీ ఆర్టికల్ 275 నిధులు ఒక కోటి 85 లక్షలతో నిర్మించిన భవనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఏటువంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, అదేవిధంగా ప్రభుత్వం నిబంధనలు ప్రకారం మెనూ పక్కా అమలు చేయాలన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారి వెంట రాష్ట్ర అటవీ హక్కుల చట్టం కోఆర్డినేటర్ ఆదినారాయణ, ఏపిఓ జనరల్ డి.ఎన్.వి.రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డిఆర్డిఏ యాంకర్ పర్సన్ రామరాజు, ఆర్ఓఎఫ్ఆర్ అధికారి జి.ఆనంద్, పీఎంయు అధికారి మోహన్, ఏఈ సత్యనారాయణ, ప్రిన్సిపల్ ఎలీషా, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రసాద్, వెంకట్ పాల్గొన్నారు.

## పంట కాలువలు, డ్రైనేజీలు, చెరువులపై ఆక్రమణలు తొలగించాలి

**– జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలోని పంచాయతీ, రెవిన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్ పరిధిలోని నీటి వనరుల కింద ఉన్న కాలువలు, చెరువులు, డ్రైన్స్ లపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అవసంమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జేసీ అపూర్వ భరత్.. రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైన్స్, పంచాయితీ ఇతర శాఖల అధికారులతో కలిసి వాచ్ డాగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని వాటర్ బాడిలకు సంబంధించిన ఆక్రమణల వివరాలు రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్, ఇరిగేషన్, డ్రైన్స్ శాఖల అధికారులతో ఆయన ఈ సందర్భంగా చర్చించారు. అక్రమణల గుర్తింపు, నోటీసులు జారీ,ఆక్రమణల తొలగింపు పురోగతిని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని నీటి వనరులను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా కాలువలు, చెరువులు, డ్రైన్స్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. రెవిన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీ అధికారులు తమ పరిధిలోని వాటర్ బాడీస్ పైన ఉన్న ఆక్రమణలను గుర్తించి, సర్వే నంబర్లు ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియ మరింత వేగం చేయాలన్నారు. జిల్లాలో డ్రైనేజీ, ఏలేరు, గోదావరి డివిజన్ల పరిధిలో ఉన్న ఆక్రమణలను గూగుల్ మ్యాప్ ద్వారా అంచనా వేసుకుని ప్రతినెల నిర్దిష్ట కార్యచరణ ప్రణాళిక ప్రకారం తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లి బాబు, కె.శ్రీరమణి, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, డ్రైన్స్ ఈఈ ఎంవీవీ. కిషోర్ అన్ని మండలాల తహశీల్దార్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముక్కామలలో ఆయిల్ పామ్ రైతులకు అవగాహన సదస్సు

**– పురుగుల నివారణ, పోషక లోపాల పరిష్కారం, అధిక దిగుబడిపై నిపుణుల సూచనలు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** ముక్కామల గ్రామంలో ఫిబ్రవరి 27వ తేదీ శుక్రవారం ఉద్యాన శాఖ మరియు సర్వే సాయి కంపెనీ సంయుక్తంగా ఆయిల్ పామ్ రైతులకు మరియు ఇతర ఉద్యాన పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఈ. విజయ ప్రసాద్ ( సిటిఆర్ఐ) విశ్రాంత శాస్త్రవేత్త, సస్య రక్షణ విభాగం, ఆయిల్ ఫామ్ పంటలో ప్రధానంగా వచ్చే నల్ల కొమ్ము పురుగు, ఎర్ర కొమ్ము పురుగు, ఎలుకల నివారణ చర్యలపై రైతులకు వివరించారు. అలాగే సూక్ష్మ పోషకాలలో ముఖ్యంగా బోరాన్, మెగ్నీషియం లోపం వల్ల పంటలో కనిపించే లక్షణాలు మరియు వాటి నివారణ మార్గాలను వివరించారు. అంతర పంటగా సాగు చేసే కోకోలో కాయ కుళ్ళు వ్యాధి నివారణకు (సిఓసి) కాపర్ ఆక్సి క్లోరైడ్‌ను మూడు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అదే విధంగా 15 రోజుల వ్యవధిలో మాంకోజెబ్ మరియు కార్బెండాజిమ్ కలిపిన మందులను రెండు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కొవ్వూరు ఉద్యాన అధికారి డి. సుధీర్ కుమార్ ఆయిల్ ఫామ్ సాగు యొక్క అవసరాన్ని, అంతర పంటల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గురించి కూడా వివరించారు. సర్వే సాయి ఏరియా మేనేజర్ వెంకట కృష్ణ రాజు ఆయిల్ ఫామ్ గెలల కోత పద్ధతులు మరియు అధిక దిగుబడి సాధనపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు నల్ల సురేంద్ర, ఆదర్శ రైతు అక్కిన కాశీ విశ్వనాథం, కరటూరి విశ్వనాథం, కోడూరు శ్రీరాములు, చిట్టూరి జానకిరామ్ తదితర రైతులు, కంపెనీ సిబ్బంది మరియు ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సు రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న వారు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల నాణ్యత సరిగ్గా లేదు

**– మండలిలో అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్**



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ఫిబ్రవరి 27వ తేదీ శుక్రవారం శాసనమండలి సభ్యులు వంక ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా అవుతున్న మందుల నాణ్యతపై ప్రశ్న లేవనెత్తారు. ఈ అంశంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం సంతృప్తికరంగా లేదని ఆయన లెజిస్లేటివ్ మీడియా సెల్ ద్వారా తెలిపారు. రాష్ట్రంలో సుమారు 60--70 శాతం ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడి ఉన్నారని, వారికి అందజేస్తున్న మందులు నాణ్యతా ప్రమాణాలు లేకపోతే అవి సరైన ప్రభావం చూపవని రవీంద్రనాథ్ పేర్కొన్నారు. దాంతో ప్రజలు గత్యంతరం లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సాధారణ యాంటీబయాటిక్ అయిన సెఫిక్సైమ్, అలాగే జీర్ణవాహిక సంబంధిత వ్యాధుల కోసం వాడే పాంటోప్రాజోల్ మందుల నాణ్యతపై అనేక ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఈ మందులను రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ పోర్టల్‌లో ఎన్ఎస్క్యూ నమోదు చేసిందో లేదో స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. కొన్ని మందులు శరీరంలో సరైన రీతిలో కరిగి రక్తంలో కలవట్లేదని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సరియైన స్థాయిలో లేవని, ఔషధ పరిమాణం తక్కువగా ఉందనే ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు స్టాక్‌లో లేవని, మరికొన్ని చోట్ల ఎక్స్పైర్ అయిన మందులు వృథా అవుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో ఈ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. డిమాండ్-సప్లై వ్యవస్థ సమర్థవంతంగా పని చేయడంలేదని ఆరోపించిన రవీంద్రనాథ్, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యత గల మందులను మాత్రమే కొనుగోలు చేసి, సమయానికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా అయ్యే విధంగా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీ లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# టిడిపి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాలపై పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుండి వివిధ సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, సీఎం రిలీఫ్ ఫండ్, గృహ నిర్మాణ పథకాలపైన ప్రజలు వినతి పత్రాలు అందించినట్లు తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ తెలిపారు. ప్రజల నుండి స్వీకరించిన వినతి పత్రాలపై ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారుల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సీనియర్ నాయకులు అడబాల కుమారస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రవిచంద్ర, కంటే జగదీష్ మోహన్, వల్లూరి శివశంకర్ (దొరబాబు), పడాల వీరబాబు, అరుణ వంశీ, తదితరులు పాల్గొన్నారు

# రైతు బజార్లో 'రైతే' కరువు.. దళారులదే 'హవా'!

**– నిబంధనలకు పాతర.. ముడుపుల మత్తులో యంత్రాంగం?**
**– 80 అడుగుల రోడ్డు 40 అడుగులకు కుదింపు.. ట్రాఫిక్ నరకంలో స్థానికులు**
**– మార్చి 10 లోపు ప్రక్షాళన జరగకపోతే ఉద్యమమే : మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు హెచ్చరిక**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**
దేశానికి వెన్నుముక్క రైతు అని కాగితాల మీద రాసుకుంటున్నాం కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ముఖ్యంగా కాకినాడ నగర నడిబొడ్డున ఉన్న రైతు బజార్ ఇప్పుడు అక్రమాలకు అడ్డాగా, దళారుల సామ్రాజ్యంగా మారిపోయింది. రైతులకు మేలు జరగాలన్న ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ బజార్లో ఇప్పుడు అసలు రైతులే కనిపించకపోవడం గమనార్హం. దళారుల ఆగడాలు, అధికారుల నిర్లక్ష్యం వెరసి సామాన్య ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

**మాస్టర్ ప్లాన్‌కు తూట్లు.. స్థానికులకు ట్రాఫిక్ నరకం**
1975 మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల వెడల్పు ఉండాల్సిన ప్రధాన రహదారిని, రైతు బజార్ పేరుతో 40 అడుగులకు కుదించేశారు. దీనివల్ల గత రెండు దశాబ్దాలుగా స్థానిక నివాసితులు నరకయాతన అనుభవిస్తున్నారు. అంబులెన్స్ వంటి అత్యవసర సేవలు రావాలన్నా, పాఠశాలకు వెళ్లే చిన్నారులు సురక్షితంగా వెళ్లాలన్నా ఇక్కడ గగనమైపోతోంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడం గమనార్హం.

**దళారుల గుప్పిట్లో యంత్రాంగం?**
రైతు బజార్లో షాపుల కేటాయింపులు పారదర్శకంగా జరగడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్టేట్ ఆఫీసర్ కార్యాలయానికి వెళ్లడానికి కూడా దారి లేనంతగా దళారులు షాపులు విస్తరించారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. చిన్నచిన్న స్థలాల కేటాయింపులో కూడా భారీగా ముడుపులు అందుతున్నాయని, మంత్రుల పేర్లు చెప్పుకుని కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ 93 బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు ఆరోపించారు.

**రాజకీయ కోణంలో రైతు బజార్ వివాదం**



గత ప్రభుత్వ హయాంలో అప్పటి చైర్మన్ బెండ విష్ణు కనీసం వారానికి ఒకసారి పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించేవారని, ఇప్పుడున్న పాలకులు కనీసం కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు కాకినాడ సిటీ ఎమ్మెల్యే పరిధిలోని ఈ అంశంలో రూరల్ ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడంపై కూడా రాజకీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమయ్యాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**మార్చి 10 'డెడ్ లైన్'.. లేదంటే ఆమరణ దీక్ష!**
వచ్చే మార్చి 10వ తేదీలోపు రైతు బజార్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని భాస్కర్ గణేష్‌బాబు డిమాండ్ చేశారు.
- అక్రమ కేటాయింపులపై విచారణ జరపాలి.
- దళారులను తక్షణమే తొలగించి నిజమైన రైతులకు అవకాశం కల్పించాలి.
- రోడ్డును విస్తరించి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలి.

ఈ డిమాండ్లు నెరవేరని పక్షంలో స్థానిక ప్రజలతో కలిసి భారీ స్థాయిలో ఉద్యమిస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని ఆయన హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి ఈ 'దళారీ వ్యవస్థ'కు చరమగీతం పాడుతుందో లేదో వేచి చూడాలి.

# అదుపుతప్పి కారు బోల్తా

**– ఒకరి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు**



**అడ్డతీగల,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ గంగవరం మండలంలోని జడేరు గ్రామ శివారున శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అడ్డతీగలకు చెందిన నలుగురు యువకులు ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఒకరు అక్కడికక్కడే మరణించగా మరో ముగ్గురు తీవ్ర గాయాలు పాలైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే అడ్డతీగల కు చెందిన మలువలస గౌతం, సిద్ద రోహిత్, షేక్ రాకీబ్, కే.రమేష్ అనే నలుగురు యువకులు కారులో గంగవరం నుండి అడ్డతీగల వస్తుండగా జడేరు గ్రామ సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బండరాళ్లను బలంగా ఢీకొనడంతో సిద్ద రోహిత్ (18) అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన ముగ్గురు తీవ్ర గాయాల పాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. వీరిని అడ్డతీగల ఆసుపత్రికి తరలించగా స్థానిక వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉన్న గౌతమ్ తో పాటు రకీబ్‌ను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు. స్వల్ప గాయాలు పాలైన రమేష్‌కి స్థానిక ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడే జాతీయ సైన్స్ దినోత్సవం



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సైన్స్ డేను పురస్కరించుకొని విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, ప్రశ్నించే వైఖరిని సృజనాత్మకతను ప్రోత్సహించేలా స్థానిక పిఎం శ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ అయోధ్యరామపురంలో పలు పోటీలు కార్యక్రమాలు రూపొందించినట్లు హెచ ఎం తోటకూర సాయి రామకృష్ణ తెలిపారు. స్కూల్ విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్, సైన్స్ రంగోలి, ప్రాజెక్టుల ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు పోటీలను సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు సైన్స్ డే వేడుకలలో బహుమతులను ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్లు సి హెచ్ లక్ష్మీ దుర్గ, జి బాల శైలజ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

### మన్యంవారిపాలెంలో వృద్ధుడు అనుమానస్పద మృతి



జగ్గంపేట, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లాలో జగ్గంపేట మండలం మన్యంవారిపాలెం గ్రామ శివారు పొలంలో వృద్ధుడు అనుమానస్పద మృతి స్థానికంగా సంచలనం రేపింది. గ్రామా నికి చెందిన గెద్దం కన్నయ్య (70) మేకలను మేపేందుకు పోతు ల బాలతిలోక సుందరి, వెంకట లావణ్య పొలం వైపు వెళ్ళాడు. బాలతిలోక సుందరి పొలంలో కన్నయ్య విగత జీవిగా పడి ఉండడంతో పక్క పొలంలో రైతు కుమారుడు మృతుడు కుమారుడు బాబూరావుకు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ఇంచార్జి సిఐ సూర్య అప్పారావు ఎస్ఐ రఘునాథ రావులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు పీక, శరీర భాగాలపై గాయాలు ఉండటంతో హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు